బడికి రాకుంటే.. మెసేజ్ ఇంటికే

- చర్యలు తీసుకున్న ప్రభుత్వం
- మెరుగవుతున్న విద్యార్థుల హాజరు
- తల్లిదండ్రుల హర్షం

రాజానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందిండంతో పాటు విద్యార్థుల గైర్హాజరుకు కళ్లెం వేసేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. ఏ కారణం చేతనైనా విద్యార్థి పాఠశాలకు రాకుంటే వెంటనే ఆయా విద్యార్థి తల్లిదండ్రుల ఫోన్‌కి ' మీ అబ్బాయి/అమ్మాయి స్కూలుకు రాలేదు' అని తెలియజేస్తూ మెసేజ్ పంపిస్తోంది. ఈ విధానం ఇంతవరకు ప్రైవేట్ స్కూళ్లలోనే ఉండేది. ఇప్పుడు ప్రభుత్వ బడులకు కూడా వర్తింపజేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనితో ప్రతిరోజూ ఉపాధ్యాయులు తరగతి గదిలో హాజరు వేసి, హాజరు కాని విద్యార్థుల గురించి వారి తల్లిదండ్రులకు పైవిధంగా మెసేజ్ పంపిస్తున్నారు. దీనికి అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. గతంలో ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపించడానికి ఆసక్తి చూపని తల్లిదండ్రులు కూడా ఇప్పుడు ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ, అమలు చేస్తున్న పథకాలు, జరుగుతున్న విద్యా బోధనతో సంతృప్తి చెంది, తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పిస్తున్నారు.

విద్యారంగంలో వినూత్న మార్పులు

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి, ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యారంగంలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బడులలో విద్యార్థుల హాజరు శాతం కూడా పెరుగుతూ వస్తోంది. మనబడి నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, స్కూల్ బ్యాగులు వంటి వాటిని కూడా జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఉచితంగా అందజేస్తున్నారు. రేషన్‌కార్డు ఉన్న తల్లిదండ్రులకు అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. ఉత్తమ విద్యను అందించే దిశగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సమకూర్చింది.



తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

విద్యాశాఖ కమిషనర్ పేరుతో..

ఇన్ని సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో విద్యార్థులందరూ పాఠశాలలకు రావాలని, వారంతా ప్రయోజకులు కావాలనే ఆకాంక్షతోనే హాజరు శాతాన్ని మెరుగుపరిచే దిశగా కూడా మెసేజ్‌ల విధానాన్ని అమలు చేస్తున్నారు. విద్యాశాఖ కమిషనర్ పేరుతో ఆయా విద్యార్థి తల్లిదండ్రులకే కాకుండా సంబంధిత గ్రామ వలంటీర్, గ్రామ సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌కి కూడా ఈ మెసేజ్ వెళుతోంది. దీనితో వారు ఆయా పాఠశాల హెచ్ఎంతో కలిసి ఆ విద్యార్థి ఇంటికి వెళ్లి, పాఠశాలకు రాకపోవడానికి గల కారణాలను ఆరా తీస్తారు. ఈ విధంగా మెసేజ్‌లు పంపించే ముందు విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల ఆధార్, ఫోన్ నంబర్లు తీసుకుని ఈ వెబ్‌లో ఎంటర్ చేయాలి. నియోజకవర్గంలో 171 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 3,365 మంది చదువుతున్నారు.

శుభపరిణామం

పాఠశాలకు విద్యార్థి సక్రమంగా రాకుంటే ఆ విషయాన్ని వారి తల్లిదండ్రులకు మెసేజ్‌ల ద్వారా తెలియజేయడం శుభపరిణామం. దీనివలన పాఠశాలలో ఆబ్సెంట్లు తగ్గుతాయి. తద్వారా వారిలో విజ్ఞాన వికాశం వృద్ధి చెందుతుంది. తరగతిలో చేసే బోధనను వంటపట్టించుకుని, మంచి ఫలితాలు సాధించే దిశగా అడుగులు పడతాయి.

– పీవీవీ భీమేశ్వరరావు, హెచ్ఎం, రాజానగరం

హర్షణీయం

తల్లిదండ్రుల ఫోన్లకు మెసేజ్‌లు పంపించడం వలన బడికి సక్రమంగా వెళ్లకపోతే ఇంట్లో తెలుస్తుందనే భయం విద్యార్థికి ఉంటుంది. దీనివలన స్కూలు మానడానికి సాధారణంగా ఇష్టపడడు. ప్రైవేట్ స్కూళ్లలో ఈ విధానం ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలు జరగడం హర్షణీయం.

– రాజ్‌కుమార్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, సూర్యారావుపేట

క్లుప్తంగా

టెన్త్ పరీక్షలకు ఎనిమిది కేంద్రాలు

రాజానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈఓ ఎం.రామన్నదొర తెలిపారు. ఈ నెల 3 నుంచి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. రాజానగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, దివ్య పబ్లిక్ స్కూల్, నరేంద్రపురం జెడ్పీహెచ్ స్కూల్, దివాన్‌చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాల, సూర్య గ్లోబెల్ స్కూల్, సంపత్ నగరం జెడ్పీ ఉన్నత పాఠశాల, కొండగుంటూరు డాన్‌బాస్కో స్కూల్ సెంటర్లుగా ఉంటాయన్నారు. ఈ పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల నుంచి 877 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 244 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ప్రతి సెంటర్‌లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అత్యవసర వైద్య సేవలను కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ముగిసిన వసంత నవరాత్రులు



కొంకుదురులో కల్యాణ వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: కొంకుదురులో బుడిత మామిడి వద్ద శ్రీనాంచారమ్మ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వసంత నవరాత్రులు శుక్రవారంతో ముగిశాయి. అర్చకుడు రమణశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం 15 రకాల హారతులతో స్వామివారిని ప్రత్యేకంగా పూజించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేడుకను తిలకించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిడి కొందడం బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం



ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ జ్యోతిర్మయి

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన తొలిసారిగా రావడంతో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను వివరించారు. జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ శ్రీవల్లికి మాతృవియోగం



తలశెట్టి సీతయ్యమ్మ (ఫైల్)

గోకవరం: స్థానిక ఎంపీపీ సుంకర శ్రీవల్లి మాతృవియోగం పొందారు. ఆమె తల్లి తలశెట్టి సీతయ్యమ్మ (75) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. సీతయ్యమ్మ మృతికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తమ సంతాపం తెలిపారు.

వార్డు సభ్యుల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వార్డు సభ్యులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామ పంచాయతీకి చెందిన నలుగురు వార్డు సభ్యులు శుక్రవారం రాజీనామా చేశారు. పంచాయతీకి చెందిన 2, 3, 6, 12 వార్డు సభ్యులైన ఆకుల గంగాభవానీ, పెంటకోట కృష్ణ, బద్దిరెడ్డి సూర్యనాగకల్యాణి, బద్దిరెడ్డి సుబ్బలక్ష్మి తమ వార్డు పదవులకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కేఎస్ఎస్ మూర్తికి అందజేశారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సీసీ రోడ్డు నిమిత్తం రూ.5 లక్షలను నిధులు మంజూరు చేశారని, ఈ నిధులకు పంచాయతీ తీర్మానం ఇవ్వకపోవడంతో సర్పంచ్ వైఖరికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఎంపీడీఓను సంప్రదించగా నలుగురు వార్డు సభ్యులు రాజీనామా పత్రాలు సమర్పించారన్నారు.

అలరించిన నృత్యం

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక సీతంపేట రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్యోత్సవం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. నాట్యాచార్యులు తణుకు సాయి మాధవి శిష్య బృందం దీనిని ప్రదర్శించింది.

కాటవరం పీఏసీఎస్ మహాజన సభ



సభలో మాట్లాడుతున్న సీఈవో నాగేశ్వరరావు

సీతానగరం: కాటవరం పీఏసీఎస్ చైర్ పర్సన్, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ (సర్వసభ్య సమావేశం) నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సీఈవో మంతిన నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వల్పకాలిక రుణాలు రూ.1.96 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ 4.35 కోట్లు, సంఘం ద్వారా చేసే వ్యాపారాల్లో పలు రుణాలు రూ.5.71 కోట్లు, బంగారు ఆభరణాలపై రూ.7.61 కోట్లు, ఎరువుల వ్యాపారం రూ.1.15 కోట్లు, విత్తనాల వ్యాపారం రూ.6.91 లక్షలు జరిగిందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.10.90 కోట్లు, సేవింగ్ డిపాజిట్లు రూ.90 లక్షలు, రికరింగ్ డిపాజిట్లు రూ.13 లక్షలు ఉన్నాయన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్లు చిట్టూరి వెంకటరామాచావు, నడిపల్లి గోపాలకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



మహిళలకు ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

పెదపూడి: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, హితకారిణీ సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ అన్నారు. కుమారప్రియం, పెద్దాడ గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో అక్క, చెల్లెమ్మలకు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని పరితపిస్తున్న ప్రభుత్వమే వైఎస్సార్ సీపీ అన్నారు. వుండ్రు సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ రెండు గ్రామాల్లో 99 డ్వాక్రా సంఘాలకు రూ.1.13 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, ఎంపీటీసీ సభ్యురాలు యాళ్ల మాధవి, కుమారప్రియం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పెమ్మబోయిన సత్తిబాబు, వైఎస్సార్ సీపీ పెద్దాడ కన్వీనర్ పాలచర్ల రామకృష్ణచౌదరి, పుట్టా కాశీరాజు, డొకుబుర్ర కృష్ణ, వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి ఏపీఎం చినబాబు, సీసీ పుష్పలత, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేద్దాం

నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు

అనపర్తి: నియోజకవర్గంలో ఏప్రిల్ 7 నుంచి 14వ తేదీ వరకూ చేపట్టే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జేసీఎస్ అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి చరిత్ర సృష్టించారని అన్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో జగనన్ననే తిరిగి ముఖ్యమంత్రిని చేయాలన్నది ప్రజల ఆకాంక్షగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పార్టీ అధినాయకత్వం సచివాలయాల కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జుల నియామకాలు చేపట్టిందని, దీనికి అనుగుణంగా రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేయడమే ధ్యేయంగా అందరూ సమష్టిగా పనిచేయాలని అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పూర్తిగా భాగస్వాములై గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో అనుసరించాల్సిన విధి, విధానాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జేసీఎస్ అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండల ఇన్‌చార్జ్‌లు చిర్ల వీర్రాఘవరెడ్డి, బొడ్డు ముత్యాలరావు, కర్రి శ్రీవెంకటరెడ్డి, మేడిశెట్టి రవిశంకర్ తదితరులు మాట్లాడుతూ సమష్టిగా ఉండి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామన్నారు. వైఎస్సార్ సీపీ బిక్కవోలు, పెదపూడి మండలాల కన్వీనర్లు పోతుల ప్రసాదరెడ్డి, గుత్తుల వెంకటరమణ, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్, నాయకులు సత్తి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామరాజు

రంగంపేట: వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ప్రతి పంచాయతీలో తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.రామరాజు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తాగునీటి పంపిణీకి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పంచాయతీ స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. మోటార్లు, పైప్‌లైన్లు, చేతిపంపులకు తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య, ఆరోగ్య సేవలు పటిష్టంగా అందించాలని సూచించారు. సచివాలయాల్లో సిబ్బంది హాజరు నూరు శాతం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏప్రియల్ 3న అందరికీ పింఛన్లు అందించాలన్నారు. ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకొచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి సచివాలయం–4 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన అందిస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామస్థాయిలో నాయకుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగనన్న పాలనను ప్రజలు విశ్వసిస్తున్నారని, రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ మరిన్ని సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకునేందుకే ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ప్రజలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, నాయకులు నల్లమిల్లి అప్పారెడ్డి, కోనాల శ్రీనివాసరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం



హరికథ కళాకారులను సత్కరిస్తున్న దేవీపార్వతి, వీరసుందరరావు

రంగంపేట: ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ సర్పంచ్ పోతుల దేవీపార్వతి, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరసుందరరావు దంపతులు పిలుపునిచ్చారు. రంగంపేటలో మంచినీటి చెరువు వద్ద శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రాచీన కళలైన హరికథ, బుర్రకథ, పౌరాణిక, సాంఘిక నాటకాల మనుగడకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్రను హరికథా గానం చేసిన ఎం.పూర్ణ, వాయిద్య కళాకారులు కిరణ్‌కుమార్, మురళీకృష్ణలను వారు ఘనంగా సత్కరించారు. సంఘ నాయకుడు ముళ్లపూడి బ్రహ్మజీ కళాకారులను అభినందించారు. మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు దార్ల అమ్మిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

మేక మాంసం విక్రయాలను పర్యవేక్షించాలి

గోకవరం: గ్రామంలో మేక, గొర్రె మాంసం విక్రయాలను అధికారులు పర్యవేక్షించాలని గోకవరం సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు కోరారు. గోకవరంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో లంపిస్కిన్ వ్యాధి సోకి అనేక మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉన్న గోకవరంలో అటువంటి వ్యాధి సోకిన మేక, గొర్రె మాంసం విక్రయాలు జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

వ్యాపారులతో సమావేశం

గోకవరంలో మేకమాంసం విక్రయించే వ్యాపారులతో పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్ రావు శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. మాంసం దుకాణాల్లో నిబంధనలు పాటించాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న మేకల మాంసం మాత్రమే విక్రయించాలన్నారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేన బెదిరింపులపై దళితుల ఆందోళన



జనసేన నాయకుల తీరును నిరసిస్తూ ధర్నా చేస్తున్న దళితులు

మధురపూడి: వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నాయకుడు పాపారావును జనసేన నాయకులు బెదిరించడంతో శుక్రవారం మధ్యాహ్నం కోరుకొండలో దళితులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ ఫిల్మ్‌నగర్‌లో తాగునీటి సమస్యను స్థానికులు శుక్రవారం ఉదయం సంబంధిత సచివాలయం సెక్రటరీ రమేష్‌బాబుకు తెలిపారు. ఆ ప్రాంతంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి, వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆయన సమాధానమివ్వడంతో స్థానికులందరూ వెళ్లిపోయారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించబడుతుండగా జనసేన నాయకులు అదే సమస్యతో ధర్నా చేశారు. అప్పటికే ఆ సమస్యను తెలియజేసిన స్థానికులను ధర్నాకు పురిగొల్పారు. దీంతో జనసేన నాయకుల తీరును అధికారులు తప్పు పట్టారు. అయితే జనసేన నాయకులు అధికారులతో వాదనకు దిగడంతో వైఎస్సార్ సీపీ నాయకులు జోక్యం చేసుకున్నారు. స్థానిక దళిత నాయకుడు పాపారావుపై జనసేన నాయకులు వేలు చూపుతూ బెదిరించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, ఇరుపార్టీల నాయకులను పంపించారు. కాగా దళిత నాయకుడు పాపారావుపై జనసేన నాయకుల బెదిరింపుల నేపథ్యంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ ఎంపీటీసీ గొల్లపల్లి ప్రవీణ్, నాయులు సుబ్బన్న, చెరుకూరి చిన్ని, ఈతకొట్టు చిన్ని ఆధ్వర్యంలో కోరుకొండ మెయిన్‌రోడ్డులో ధర్నా చేశారు. సమావేశాలకు ఆటంకం కలిగిస్తూ, దళితులను బెదిరిస్తున్న వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అంగీకరించడంతో ఆందోళనను ఉపసంహరించుకున్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో విజయం సాధ్యం

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యం సాధిస్తారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్నిరంగాలలోను ముందంజలో ఉన్నారన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వాణికుమారి ముందుగా పాఠశాల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కె.జ్యోతి పాల్గొన్నారు.

లాభాల బాటలో బూరుగుపూడి సొసైటీ



బూరుగుపూడి సొసైటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సొసైటీ (పీఏసీఎస్)ని లాభాల బాటలోకి తీసుకెళ్లినట్టు, రైతాంగానికి డివిడెండ్లు అందించడానికి కృషిచేస్తున్నట్టు చైర్ పర్సన్ బుద్దిగ సత్తిబాబు తెలిపారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం సొసైటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 850 మంది సభ్యులతో కూడిన సంఘం రూ.18 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. పంట రుణాలు పేరిట రూ.లక్ష, ఎల్టీ రుణాల పేరిట రూ. రెండు లక్షలను రైతులకు అందించామన్నారు. సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కంటే సత్తిబాబు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన 1987 సంవత్సరం వరకూ డివిడెంట్లు అందించిన సంఘం.. రుణాలు వసూలు కాకపోవడంతో డివిడెంట్లు అందజేయలేకపోతున్నామన్నారు. అప్పట్లో సీఈఓగా బాధ్యతలు నిర్వహించిన వెంకటేశ్వరరావు అవినీతికి పాల్పడటంతో సంఘం నష్టాల్లోకి వెళ్లినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైఎస్సార్ సీపీ నాయకుడు, గుమ్ములూరు మాజీ సర్పంచ్ మట్టా పెద్ద వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా నిర్దిష్ట సమయంలో రుణ సదుపాయం కల్పిస్తామన్నారు.

సోమవారం నుంచి శనగల కొనుగోలు

గుమ్ములూరు, బుచ్చెంపేట కొనుగోలు కేంద్రాల్లో సోమవారం నుంచి శనగల కొనుగోలు ప్రారంభించనున్నట్టు ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు తెలిపారు. కేంద్రం ప్రారంభమైనప్పటికీ కొనుగోలు చేయడంలో సొసైటీ అధికారుల వల్ల జాప్యం జరిగిందన్నారు. దోసకాయలపల్లి సొసైటీ ద్వారా 183 మంది రైతులకు రూ.1,42,237 పంట రుణాలుగా అందజేసినట్టు చైర్ పర్సన్ గొల్లవిల్లి మురళీ తెలిపారు. ఆయన అధ్యక్షతన కోరుకొండ మండలం దోసకాయలపల్లి సొసైటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. మురళీ మాట్లాడుతూ సంఘం టర్నోవర్ రూ.13,78,00,000గా ఉందన్నారు. సమావేశంలో బూరుగుపూడి సొసైటీ సీఈఓలు ఈదల సుదర్శనరావు, కొయిడాల శివ అప్పలరాజు, సొసైటీల పర్సన్లు ఈర్ల బుజ్జియ్య, అడపా రామకృష్ణ, గండి బోయిన రాజ్‌కుమార్, నెక్కంటి అప్పారావు, బూరుగుపూడి మాజీ సర్పంచ్ కంటే సత్తిబాబు, గుమ్ములూరు మాజీ సర్పంచ్ మట్టా పెద్ద వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శన



వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతిబింబించేలా నమూనాలు ఉన్నాయని జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవాశిబిరంలో భాగంగా శుక్రవారం తొర్రేడు సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను ఆయన, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్ ప్రారంభించారు. వ్యవసాయంలో వచ్చిన మార్పులను వివిధ నమూనాల ద్వారా విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం సొసైటీ సమావేశ మందిరంలో రైతు సదస్సు, ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ముగింపు సమావేశం జరిగింది. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శర్మ, డాక్టర్ బాలాజీ.. రైతులకు పలు సూచనలు అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ హైమజ్యోతి, డాక్టర్ కె.రవికుమార్ వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సేవాశిబిరం గురించి వివరించారు. కార్యక్రమంలో తొర్రేడు సొసైటీ అధ్యక్షుడు చిట్టూరి వెంకటరావు, సభ్యుడు దండమూడి అర్జునరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణ, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ ఉషా రాణి, డాక్టర్ పి.అమ్మాజీ పాల్గొన్నారు.